

ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు. మాజీ మంత్రి పువ్వాడ

## కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టాలి

- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- నామా గెలుపు చరిత్రలో నిలిచిపోతుంది
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 19 : 'అధికారంలో లేమని అధైర్యపడొద్దు.. నేను ఎవరికీ భయపడను.. నన్ను మంచి మెజార్టీతో గెలిపించండి.. మీకు అన్నివిధాలా అండగా ఉంటా.. ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొంటా' నని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించారు. శుక్రవారం ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నామా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రతి వాగ్దానం వెనుక మోసం దాగి ఉందనే విషయాన్ని ప్రజలు గ్రహించారని, కసితో ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రజలకు వాస్తవాలు చెప్పి, అబద్ధపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీగా పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రయోజనాలు కోసం, ప్రాజెక్టులు, నిధులు, హక్కులు, రైతులు, బడుగు, బలహీనవర్గాల వారి కోసం మాట్లాడటం జరిగిందని చెప్పారు. మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు.

### చరిత్రలో నిలిచిపోయేలా నామా గెలుపు

నామా నాగేశ్వరరావు గెలుపు చరిత్రలో నిలిచిపోతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు అభ్యర్థినే నిర్ణయించలేక పోయిందని దుయ్యబట్టారు. జిల్లాకు చెందిన మంత్రులు గతంలో కుటుంబపాలన గురించి బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేశారని, ఇప్పుడేమో వారి కుటుంబ సభ్యులకు ఎంపీ సీటు కోసం పైరవీలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయడంతో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని అన్నారు. జిల్లా ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నారని తెలిపారు. కాగా సమావేశానికి హాజరైన మాజీ మంత్రి పువ్వాడ తన బర్త్‌డే సందర్భంగా నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్‌చేశారు.

## శ్రీరాముడి నుదిటిపై సూర్యకిరణాలు

ములుగు జిల్లా ఏటూరునాగారంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం విగ్రహ మూర్తులను అలంకరించిన తరువాత సూర్యకిరణాలు నేరుగా శ్రీరామచంద్రమూర్తి విగ్రహం నుదిటిపై పడినట్టు అర్చకులు తెలిపారు. ఈ అరుదైన దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

- ఏటూరునాగారం



# కడియం.. దమ్ముంటే రాజీనామా చేసి గెలువ్

- నిన్ను రాజకీయంగా సమాధి చేయడమే లక్ష్యం
- శ్రీహరిపై నిప్పులు చెరిగిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



హనుమకొండలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో స్టెప్పులేస్తున్న మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య. చిత్రంలో ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 19: 'నేను రోషం ఉన్న వాడిని.. తొడగొట్టి, మీసం తిప్పి సవాలు చేస్తున్న.. దమ్ముంటే రాజీనామా చేసిరా.. ఇద్దరం తేల్చుకుందాం.. నా ఏకైక లక్ష్యం నిన్ను రాజకీయంగా సమాధి చేయడమే. నన్ను ప్రజల్లో పల్చన చేసినవ్.. ఇబ్బంది పెట్టినవ్.. నీవో గుంటనక్క, అవకాశవాదివి' అంటూ మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య కడియం శ్రీహరిపై నిప్పులు చెరిగారు. శుక్రవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగింది. 'దేఖ్ లేంగే.. ఔర్ ఏక్ దక్కా.. కేసీఆర్ పక్కా' పాటకు రాజయ్య విజిల్ వేస్తూ నృత్యం చేసి కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఇటు దళితులు, అటు పద్మశాలీ, బైండ్ల జాతి ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు. కడియంపై మూడుసార్లు గెలిచానని, దుర్మార్గుడిని ఓడించావని 2009లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనను మెచ్చుకున్నారని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎంజీఎంలో జై తెలంగాణ అన్న విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ తనకు దేవుడని, తనను ఉపముఖ్యమంత్రి చేశారని, కానీ కడియం కుట్రలు చేసి తన పదవి లాక్కున్నాడని ఆరోపించారు. పశ్చిమ నుంచే మళ్లీ గులాబీ జెండా ఎగిరి ఉద్యమం మొదలవ్వాలని పిలుపునిచ్చారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ సర్కార్ కూలిపోతుందని చెప్పిన కడియం శ్రీహరి అదే పార్టీలోకి పోయి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియంను ఓడించి వరంగల్ సీటును కేసీఆర్‌కు బహుమానంగా ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ మొత్తం వరంగల్ వైపు చూస్తున్నదని, వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కడియం శ్రీహరికి ఎమ్మెల్యే పదవి బీఆర్ఎస్ పార్టీ పెట్టిన భిక్ష అని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి అహంకారం, మోసం, కుటిల రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ కడియం–అరూరి గురుశిష్యులని, వారిని వరంగల్‌లో రాజకీయంగా భూస్థాపితం చేయబోతున్నామని తెలిపారు. ఉద్యమకారుడినైన తనను ఈ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రోడ్‌షోలో మాట్లాడుతున్న కరీంనగర్ అభ్యర్థి వినోద్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు వొడితెల, రసమయి, వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్

## కాంగ్రెస్‌ది మోసపూరిత పాలన

- రోడ్‌షోలో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 19: కాంగ్రెస్ సర్కార్ అబద్ధాల పునాదులపై ఏర్పడిందని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని, ఎన్నో ఏండ్లుగా కొట్లాడి తెలంగాణ సాధించినట్టు తెలిపారు. పిల్లల భవిష్యత్తు కోసం పార్లమెంట్‌లో తమ గొంతుక వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు ఎంపీలుగా ఉండాలన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే ఎల్కతుర్తి మీదుగా జాతీయ రహదారులను మంజూరు చేయించానని గుర్తుచేశారు. కృష్ణ, గోదావరి నదులపై నిర్మించిన అనేక సాగునీటి ప్రాజెక్టుల అనుమతి కోసం కేసీఆర్ సూచన మేరకు కృషి చేశానని తెలిపారు. రోడ్‌షోలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్, వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో అర్చకుడి ఆత్మహత్య



ఓంప్రకాశ్ (ఫైల్)

కాశీబుగ్గ, ఏప్రిల్ 19: ఆర్థిక ఇబ్బందులతో అర్చకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన వరంగల్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సార్ నగర్‌కు చెందిన మార్త ఓంప్రకాశ్ (38) కాశీబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుడిగా పని చేశారు. ప్రస్తుతం మొగిలిచర్ల శివాలయంలో సేవలందిస్తున్నారు. వచ్చే జీతం కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆయన తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొన్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.



అర్వపల్లిలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి మల్లేశ్, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు గాదరి, భిక్షమయ్యగౌడ్

## రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

- నీళ్లు ఇవ్వడం చేతకాని పాలకులు
- హామీల అమలులో విఫలం
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

అర్వపల్లి, ఏప్రిల్ 19 : చెరువులో లూటీకి పోయినట్టు, దోపిడీ దొంగలు పడ్డట్టు తెలంగాణను సర్కార్ లూటీ చేస్తున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్ ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి విఫలమై ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎటు చూసినా ఎండిన పొలాలు, తాగునీటి సమస్యలతో రైతులు, ప్రజలు సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుటుంబపాలన అన్నవారు వీరి ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి కుటుంబం, జిల్లాల్లో చూస్తే జానారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కుటుంబం మరో జిల్లాలో మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబాలు ఏ జిల్లాకు పోయిన కుటుంబ పాలన సాగుతుందని ఎద్దేవా చేశారు. అలీబాబా 40 మంది దొంగల్లా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. రైతులు పండించిన వడ్లను అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వడం లేదని విమర్శించారు. ఉన్న నీళ్లను ఇవ్వడం చేతకాక లక్షల ఎకరాల్లో పొలాలు ఎండబెట్టిన ఘనత రేవంత్ సర్కార్‌ది అని మండిపడ్డారు. తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడకు రావాల్సిన మంచినీళ్లను ఆంధ్రావాళ్లు తీసుకుపోతుంటే వీళ్లకు సోయి లేకుంటే అధికారులు బయట పెట్టినట్టు తెలిపారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ రోజూ రేవంత్‌రెడ్డి జపం చేస్తున్నారే తప్ప జిల్లా ప్రజల సమస్యల గురించి ఆలోచించడం లేదని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్లు గుజ్జ దీపికాయుగందర్‌రావు, సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మొద్దు

**బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

కొల్లాపూర్, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ నేతల కల్లబొల్లి మాటలను నమ్మొద్దని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా సంఘటితంగా పనిచేసి కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### నామినేషన్‌కు విరాళం

కల్వకుర్తి, ఏప్రిల్ 19 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి– శ్రీశైలం ప్రధాన రహదారిపై తెలంగాణ బ్లాక్ వాయిస్ వ్యవస్థాపకుడు శ్రీధర్ గోవింద్ ఆధ్వర్యంలో నామినేషన్ డిపాజిట్ కోసం 'ఆర్ఎస్ సపోర్టర్ మీట్' ద్వారా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వచ్చిన రూ.17,500 మొత్తాన్ని అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు.



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు విరాళం అందజేస్తున్న అభిమానులు


